

పార్వేట ఉత్సవంలో లక్ష్మీనృసింహస్వామి వారు



విజయకీలాద్రి పర్వతంపై భూసమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

వైభవంగా దసరా వేడుకలు

ఆలయాలలో ప్రత్యేక పూజలు

మంగళగిరి: దసరా నవరాత్రుల మహోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం దసరా పండుగ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పార్వేట మహోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయం, అఖిలాండేశ్వరి దేవి ఆలయాలలో మహిషాసుర మర్దినిగా అమ్మ వారు దర్శనమిచ్చారు. పాత మంగళగిరి కనకదుర్గ ఆలయం, ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాళీమాత ఆలయంలో రాజరాజేశ్వరి దేవిగా, పోలేరమ్మ ఆలయంలో దుర్గాదేవిగా, పాత మంగళగిరి కనకదుర్గ ఆలయంలో విజయదుర్గ అలంకారంలో అమ్మ వారు దర్శనమివ్వగా భక్తులు అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని దేవీ ఆలయాల్లో శరన్నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమీనాబాద్‌లో మూలాంకురేశ్వరి అమ్మకు అర్చకులు ఉదయాన్నే పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఖడ్గమాల పూజ, అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తు లకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఫిరంగిపురంలో ని వాసవీ కన్యకాపరమేశ్వరి, విజయదుర్గా ఆలయం, వేములూరిపాడులోని అన్నపూర్ణ మాత, ను దురుపాడులోని విశాలాక్ష్మి అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు చేసి కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రులు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో చివరిరోజు అమ్మవారికి ఉదయం మహిషాసురమర్దినీదేవి, మధ్యాహ్నం రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజలను ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి పర్యవేక్షించారు. మోరంపూడిలో జై గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ముగిశాయి.

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లో....

తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లోని గంగ బాలత్రిపుర సుందరీదేవి రాజరాజేశ్వరిదేవి సమేత త్రిపుర తాండవేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి నవమి, దశమి తిథుల సందర్భంగా మహిషాసుర మర్దినిదేవి, రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పోలకంపాడులోని వినుకొండ అంకమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మహిషాసుర మర్దినీదేవి అలంకారణం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

విజయకీలాద్రిపై.....

సీతానగరం విజయకీలాద్రిపై అమ్మవారికి త్రిదండి చిన్నజీయర్‌స్వామి, అహోబిల రామానుజ జీయర్‌స్వామి వార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు విజయాద్రి వెంకటేశ్వరస్వామికి అభిషేకం, 10.30 గంటలకు భూసమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటల నుండి శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, శమీవృక్ష ఆరాధన, అష్టోత్తర శతనామార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



మంగళగిరి శివాలయంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు



కాళీమాత ఆలయంలో రాజరాజేశ్వరి దేవిగా..



పోలేరమ్మ ఆలయంలో దుర్గాదేవిగా..



అఖిలాండేశ్వరి ఆలయంలో మహిషాసుర మర్దినిగా..



పాత మంగళగిరిలో కనకదుర్గ అమ్మవారు..



కనకదుర్గ ఆలయంలో విజయదుర్గగా..



పుష్పాలంకరణలో అమ్మ వారు



మోరంపూడిలో మహిషాసుర మర్దినిగా..




పోలకంపాడులో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



తాడేపల్లి బొమ్మల మండపం సెంటర్‌లోని శివాలయంలో..



శ్రీమహంకాళి ఆలయంలో మహిషాసుర మర్దినిగా..



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బెటాలియన్ కమాండెంట్ ఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి

పెదవడ్లపూడిలో భక్తి శ్రద్ధలతో..



పుష్పాలంకరణలో అమ్మ వారు



ధనలక్ష్మీ అలంకారంలో అమ్మ వారు

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించి దసరా రోజు పుష్పాలంకరణ, ధనలక్ష్మీ అలంకారంలో అమ్మ వారు దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అన్నే వారి బావి వద్ద నిర్వహించిన వేడుకలలో చివర రోజు మంగళవారం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి తగిన ప్రాధాన్యం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

మేడికొండూరు: అభివృద్ధి సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మండల పరిధిలోని డోగిపర్రులో రూ.1.30 కోట్లతో నిర్మించిన సచివాలయం భవనం, సోలార్ లైట్లు, గ్రావెల్ రోడ్డును వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్డు వేయాలని గత ప్రభుత్వాన్ని కోరినప్పటికీ నోచుకోలేదన్నారు. సమస్య తమ దృష్టికి రాగానే నిర్మించినట్లు చెప్పారు. ఈ నిర్మాణంతో ఐదు గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడు ముందుంటామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చాన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యతమనందరిపై ఉందని పిలుపునిచ్చారు. మరి కొన్ని సమస్యలు ప్రజలు కత్తెర దంపతుల దృష్టికి తీసుకు రాగా, వాటిని పరిష్కరిస్తామన్నారు. తొలుత డోగిపర్రులో పోలేరమ్మ గుడిలో పూజలు నిర్వహించారు. కనక దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, సర్పంచి కొండెపోగు సామ్రాజ్యం, ఎంపీటీసీ రామకోటేశ్వరమ్మ, ఉపసర్పంచి జానీ, పార్టీ మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, ఉడతా ప్రభాకర్, ఉడతా శంకర్, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, కొండెపోగు కోటేశ్వరరావు, షేక్ షరీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ పాల్గొన్నారు.



గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్

అన్నమ్మ, నరసింహారావుల జీవితం ఆదర్శప్రాయం

ప్రొఫెసర్ జి.హరగోపాల్

గుంటూరు ఎడ్యుకేషన్: నిజమైన మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావాలకు ప్రభావితమై దశాబ్దాల పాటు మానవీయ సంబంధాలకు ప్రతీకగా నిలిచిన నక్కా అన్నమ్మ, నరసింహారావు ఆదర్శ దంపతుల జీవితం ఆదర్శప్రాయమని సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు జి.హరగోపాల్ పేర్కొన్నారు. శ్రీకరం చలమయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నక్కా అన్నమ్మ ద్వితీయ స్మారక సభను మంగళవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ శీలం లక్ష్మారెడ్డి వేదికపై బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ నాయకుడు కె.రవిచందర్ అధ్యక్షతన 'భారతదేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు' అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. ఈసందర్భంగా జి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎన్‌వీ నరసింహారావు రచించిన 'నేను నా 75 సంవత్సరాల సామాజిక జీవితం' పుస్తకాన్ని పౌర హక్కుల సంఘం ఏపీ, నాయకుడు డాక్టర్ రాజారావు ఆవిష్కరించారు. విప్లవ రచయితల సంఘ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ పుస్తక పరిచయాన్ని చేశారు. రెండవ సమావేశానికి విరసం నల్లూరి రుక్మిణి అధ్యక్షత వహించగా అన్నమ్మ స్మారకోపన్యాసం 'మహిళా సాధికారిత, రిజర్వేషన్లపై' సామాజిక విశ్లేషకురాలు కె.సజయ మాట్లాడారు. మూడవ సమావేశానికి ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు ఎస్.శామ్యూల్ అధ్యక్షత వహించగా 'ఫాసిజం, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, అంశాలు' అంశంపై ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ ఉపన్యసించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజారావు, హరగోపాల్, రవిచందర్, రుక్మిణి, శామ్యూల్ తదితరులు

పేకాట రాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధాబత్తినవారి వీధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 16వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

వడ్డమాను(తాడికొండ): తుళ్లూరు మండలం వడ్డమానులో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడిన పది మంది ఉద్యోగులు వెల్ విషర్ టీం ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా 15 మంది వృద్ధులు, పేదలకు నిత్యావసరాలు, రగ్గులు అందించారు. గ్రామంలో ఉత్తమ ప్రతిభతో ఉత్తీర్ణత సాధించిన కూరపాటి అంజలికి ఇంటర్ ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతుండగా స్పందించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. తొలి విడత సాయంగా రూ.9 వేలు ఫీజు చెల్లించిన రసీదు అందజేశారు. కార్యక్రమంలో వెల్ విషర్ అధ్యక్షుడు మాజీ సబ్ రిజిస్ట్రార్ బెజ్జం నాగేశ్వరరావు, బెజ్జం ఫౌండేషన్ అధ్యక్షుడు బెజ్జం రామ కృష్ణారావు, వెల్ విషర్ సభ్యులు ఉపాధ్యాయులు కొమరాబత్తిన స్టీవెన్, మంటి సాంబశివరావు, కాకి శ్యామ్, యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పళ్ళం రవికుమార్, రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ మేరుగ రత్తయ్య పాల్గొన్నారు.



పేదలకు నిత్యావసరాలు, రగ్గులు పంపిణీ చేస్తున్న వెల్ విషర్ టీం సభ్యులు

చిన్నం యువరాజుకు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక సలహాదారుడు చిన్నం యువరాజుకు కాకినాడలోని జేఎన్‌టీయూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టూల్స్ ఫర్ డిసీస్ ప్యాటర్న్ డిఫ్యూజన్ ఎనాలసిస్ అండ్ మాపింగ్' అనే అంశంపై కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆర్థిక సహకారంతో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేస్తూ, జేఎన్‌టీయూ ఎవాల్యుయేషన్ డైరెక్టర్ బి.బాలకృష్ణ నోటిఫికేషన్ విడుదల చేశారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ అయ్యంకి మురళీకృష్ణ, ప్రముఖ పర్యావరణ ఇంజనీర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు చిన్నం యువరాజు పీహెచ్‌డీ పట్టా పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. కృత్రిమ మేథ సహకారంతో నూతన ఆవిష్కరణకు ఈ పరిశోధన దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ యువరాజుకు అభినందనలు తెలిపారు.



మహిళలకు చీరల పంపిణీ



నగరంపాలెం: ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇత్రాయేల్‌పేట ఒ కటో వీధిలో సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు లు వేడుకలు జరిగాయి. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయగా, మహిళలకు చీరలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుంట్ల రాజాబాబు మాట్లాడుతూ ప్రభా స్ నేటి యువతరానికి ఆదర్శనమని అన్నారు. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు అందరికి ఆదర్శనీయమని కొనియాడారు. స్వర్ణసుమంత్, ఏసురాజు, లాజర్, సుందరరావు, నాగసాయి, గోపీసాధిక్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

తాడేపల్లిరూరల్: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణానది కనకదుర్గ వారధి వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరిబాబు అందించిన వివరాలు.. కోడిపందేలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి రూ.63 వేలు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

నిరుపేదల గుండెచప్పుడు ఎస్ఆర్ శంకరన్

లక్ష్మీపురం: జీవితమంతా పీడిత ప్రజల సంక్షేమం కోసం పాటుబడిన ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ బడుగు జన బాంధవుడిగా, నిరుపేదల గుండె చప్పుడుగా పేరొందారని సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ ఎస్.ఆర్.శంకరన్ సంస్మరణ సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి ఎస్.ఆర్. శంకరన్ జీవితం అంకితం చేశారన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం అనే పదానికి నిర్వచనం ఇచ్చి చట్ట పరిధిలో అమలు చేసిన ఆ మహనీయుడిని నేటి తరం అధికారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేదలకు ఉండాల్సిన హక్కుల్ని సంక్షేమ పథకాల్ని వారికే దక్కేలా శంకరన్ కృషి చేశారని గుర్తు చేశారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన సభ్యులు ఎస్ఆర్ శంకరన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలి

ఎమ్మెల్సీ హనుమంతరావు



మంగళగిరి: ఆలయాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పిలుపునిచ్చారు. నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ప్రధాన రహదారి అయిన గౌతమబుద్ధారోడ్డు వెంట భక్తులకు స్వాగతం పలుకుతూ దాత తులిమిల్లి శ్రీనివాసరావు నిర్మించనున్న ముఖద్వారానికి సోమవారం ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి, బీజేపీ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, మాదల కృష్ణ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు బత్తుల




తాడికొండ: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవారిని మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. తుళ్లూరు మండలం వడ్డమానులో నిర్వహించిన దసరా వేడుకలలో ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మ నందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ తుళ్ళూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, మాజీ సర్పంచి చుండు వెంకటరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబర్ 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు కోరా రు. దుగ్గిరాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రజారక్షణ భేరి వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. దేశం అస్తవ్యస్తంగా తయారైందని, బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో మైనార్టీలకు, దళితులకు, మహిళలకు భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయ కులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ అక్టోబర్ 25వ తేదీన దుగ్గిరాలలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద హైలెవల్ చానల్‌ను పూర్తిచేసి రైతులని ఆదుకోవాలని ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.చిరంజీవి పాల్గొన్నారు.

అలరించిన పౌరాణిక రంగస్థల ఏకపాత్ర పోటీలు



నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల పౌరాణిక రంగస్థల ఏకపాత్ర పోటీలు జరిగాయి. ఈ పోటీలను టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, కాపునాడు గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగ్గా, 55 మంది హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా రంగస్థల నటుడు సింగర కొండయ్యచౌదరి, ప్రముఖ కవయిత్రి తుమ్మల స్నిగ్ధమాధవి, జి.గంగాధర్‌రావు, వ్యాఖ్యాతగా పి.కృష్ణారావు వ్యవహరించారు. హార్మోనిస్ట్ శిరిగిరి సాంబశివరావు, వెంకటేశ్వరరావు వాద్య సహకారం అందించారు. ప్రథమ బహుమతి రూ.6 వేలను బాపనపల్లి వెంకటస్వామి (రావణ బ్రహ్మ పాత్ర), ద్వితీయ బహుమతి రూ.5వేలు కేశన నాగేశ్వరరావు (అర్జునుడు పాత్ర), తృతీయ బహుమతుల కింద ఇద్దరికి రూ.2 వేలు చొప్పున అందజేయగా, పలువురికి ప్రత్యేక బహుమతులు అందజేశారు.